4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 10 జూన్ 2024
www.ntnews.com

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

చౌరస్తా

పెద్ద పెద్ద ఇమారత్‌ల ముందునుంచి
నడుస్తూ నడుస్తూ
చౌరస్తా దగ్గరికొచ్చాను
విశాలంగా చాపిన చేతుల్లా
నాలుగు దిక్కులా రోడ్లు

ఎవరో తరుముతున్నట్టు
రంగు రంగుల కార్లూ
బస్సులూ మనుషులూ
ఒకటే పరుగు
అందరూ ముందు
పోయేవాళ్లని దాటేయాలనే
అంతా రద్దీ రద్దీ రణగొణ ధ్వని
పరుగు పందాన్ని చూస్తూ
ఊపిరాడక పలకరించేవాళ్లు లేక
ఒంటరిగా బిక్కమొహమేసుకు
నిలబడిన
చౌరస్తాని చూసి జాలేసింది

పాపం ఒంటరిదాన్ని అనునయిద్దామని
వీపుతట్టి పలకరిద్దామని
దగ్గరకు వెళ్లాను

చిత్రంగా
నేను చౌరస్తాలోకి ఒలికిపోయాను
చౌరస్తా నాలోకి ఇంకిపోయింది

మహానగరంలో ఒంటరితనం
ముసి ముసి నవ్వులు నవ్వింది

ఆనంద్ వారాల
94405 01281

తోకలేని పిట్టలో వినూత్న సాహిత్యం

'తోక లేని పిట్ట తొంటై ఆమడల దూరం చేరుకుందట!... అదేమిటో చెప్పుకోండి చూద్దాం' అంటూ 'లేఖ'పై చిన్నప్పుడు పొడుపు కథ వేసుకునేవాళ్లం. లేఖలు జన జీవనంలో భాగమయ్యేవి. అలాంటి ఉత్తరాలు, ఇన్లాండ్ లెటర్లు ఇప్పుడు ఈ-మెయిల్, వాట్సాప్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచంలో, ఏ మూలకైనా క్షణాల్లో చేరిపోతున్నాయి. పోస్టుమ్యాన్ తెచ్చే ఉత్తరాల కోసం ఇప్పుడు ఎదురుచూపులు లేవు, ఆ మధురోహలు లేవు.

> అయితే, ఈ లేఖలు రాయడానికి గల నియమ, నిబంధనలు, చాణక్యుడు తన అర్థశాస్త్రంలో విపులంగా వివరించాడు. తెలుగులో మొట్టమొదటిసారి లేఖను స్వీకరించిన వ్యక్తి సీపీ బ్రౌన్. 'లేఖ ఒక హృదయం నుంచి సుఖదుఃఖాలను రెండో హృదయానికి అందించే దూత' అని దోనేపూడి రాజారావు నిర్వచించారు. ఇక లేఖ సాహిత్యం విషయానికి వస్తే, సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక పరమైన అంశాలు కలిగిన లేఖలను లేఖా సాహిత్యంగా చెప్పుకోవచ్చు. వ్యక్తిగత పరిధి దాటినప్పుడు, లేఖలకు సామాజిక విలువ ఏర్పడి, అవి మొత్తం సమాజానికి చెందుతాయి.

'లిఖ్' అనే ధాతువు నుంచి 'లేఖ' అనే పదం వచ్చింది. మనకు తెలిసినంత వరకు ప్రపంచంలో వచ్చిన మొట్టమొదటి లేఖా సాహిత్యం ఆచార్య నాగార్జునుడు రాసిన 'సుహృల్లేఖ'. తన మిత్రుడైన యజ్ఞశ్రీ శాతకర్ణికి, ప్రాకృత భాషలో రాశారు. తర్వాత, సంస్కృత సాహిత్యంలో మహాకవి కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలంలో శకుంతల తన భర్త దుష్యంతుడికి తామరాకుపై తన గోటితో లేఖ రాసింది. ఇది భారతీయ సాహిత్యంలో మొట్టమొదటి లేఖా సాహిత్యం.

> **ఇక ప్రాచీన తెలుగు సాహిత్యంలో పింగళి సూరన 'ప్రభావతీ ప్రద్యుమ్నం' కావ్యంలో ప్రభావతి, ప్రద్యుమ్నునికి రాసిన ఉత్తరం. తిరుపతి వేంకట కవుల వాగ్వాదం నుంచి 'గీరతం అనే లేఖా సాహిత్యం' వచ్చింది. తిరుపతి వేంకట కవులు, కొప్పరపు సోదరులు, ఒకరిపై ఒకరు ఛలోక్తులు విసురుకుంటూ చక్కని సాహిత్యాన్ని ఉత్తరం ద్వారా మనకు తెలియజేశారు. గీరతం తెలుగు సాహిత్యంలో ఒక విలక్షణమైన లేఖా సాహిత్యం.**

1916లో త్రిపురనేని గోపీచంద్ 'పోస్టు చేయని ఉత్తరాలు', 'ఉభయ కుశలోపరి' అనే సాహిత్య లేఖలు రచించారు. వీటిల్లో భౌతిక-ఆధ్యాత్మికవాద సమన్వయమైన సాహిత్యం చోటుచేసుకుంది. వారి ఉత్తరం నుంచి ఒక చిన్న ఉదాహరణ. 'కవి మేధా సముద్రం నుంచి పరంపరగా పొంగి పొరలివచ్చు అభిప్రాయ వీచికలకు, సంప్రదాయాలని చెప్పి చెలియకట్ట ఏర్పరచడం సబబు కాదు' అంటూ కవి స్వేచ్ఛగా తన భావాన్ని తెలియజెప్పాలని స్పష్టంగా సూచించారు. ఇక 'సంజీవ్ దేవ్' లేఖా సాహిత్యం మనకు చిర పరిచితమే!. ఈయనకు 14 భాషల్లో ప్రావీణ్యం ఉన్నది. 'పోస్టు చేసిన ఉత్తరాలు' అనే 50 లేఖల సంపుటిలో మానవ జీవన కోణాలు, ఆప్యాయతలు, అనురాగాలు అనే అంశాలు ఇందులో ఉన్నాయి.

ఇక ప్రముఖ కవులు, రచయితలైన గుంటూరు శేషేంద్ర శర్మ 'ప్రేమలేఖలు', మల్లాది వెంకటకృష్ణ మూర్తి రాసిన నవల 'దూరం', బోయి భీమన్న రాసిన 'జానపదుని జాబులు', మిత్తింటి మందేశ్వర రావు 'లేఖా ప్రబంధం', చలం రాసిన 'ప్రేమలేఖలు', కనుపర్తి వరలక్ష్మమ్మ 'శారద లేఖలు', తిలక్ రాసిన 'పోస్టుమ్యాన్', కే.ఎల్.నరసింహారావు రాసిన 'నాన్నకు జాబులు'.. ఇలా ప్రసిద్ధ కవులు లేఖా సాహిత్యం రాసి పాఠకులను అలరించారు.

ఇంతమంది ప్రముఖ రచయితల కలం నుంచి వెలువడిన లేఖా సాహిత్యంలో వారి మనోగత అభిప్రాయాలే కాక, సాహితీవేత్తల వ్యక్తిత్వం కూడా తెలుసుకోవచ్చు. భగవాన్ రమణ మహర్షి దినచర్య గురించి, సూరి నాగమ్మ తన అన్నయ్యకు రాసిన ఉత్తరాలు ఎంతో విలువైన లేఖా సాహిత్య ప్రక్రియలు. ఇక ఈ లేఖా సాహిత్యం ఆధారంగా జంధ్యాల 'శ్రీవారికి ప్రేమలేఖ' అనే సినిమా తీశారు. ఒక తెలియని వ్యక్తికి రాసిన ప్రేమ లేఖ ద్వారా సినిమా కథంతా చాలా హాస్యంగా, రమ్యంగా నడిపించారు. కవితిలక తిరునగరి ప్రతి 15 రోజులకొక కార్డు ఉత్తరంలో తాను రాసిన ఒక కవిత, ఇటీవల గ్రంథాల్లో చదివిన చక్కని పద్యం, దానిలోని భావాన్ని, లేఖ ఎవరికి రాశారో, ఆ వ్యక్తికి/ కవికి అన్వయిస్తూ, మీ కలాన్ని ఆగనివ్వకండి కొనసాగించండి అంటూ ఎంతో స్ఫూర్తిదాయకంగా రాసేవారు. ఈ పోస్టు కార్డు లేఖా సాహిత్యం అందుకున్నవారిలో నేను కూడా ఉన్నానని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ఇది నిజానికి లేఖ సాహిత్యంలో ఒక వినూత్న అధ్యాయం.

కేతవరపు రాజ్యశ్రీ
85001 21990

2022లో జ్యోతి వలభోజు సంపాదకురాలిగా 'ప్రియమైన నీకు' అనే 175 మంది రచయితల లేఖలను సంకలనం చేసి ప్రచురించారు. ఈ సంకలనం తెలుగు బుక్‌హౌజ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నది. ఈ లేఖల్లో బయటకు బహిర్గతం చేయలేని విషయాలు, స్నేహితులకు, భర్తకు, తల్లికీ, నమ్ముకున్న దేవుడికీ రాసిన ఉత్తరాలున్నాయి. నిజానికి మన ఉత్తరాలకు, సమాధానం వస్తుందని ఆశించకుండా, మనసులోని భావాలు పంచుకోవడం వల్ల మనలోని భారం తగ్గుతుంది. ఈ ప్రక్రియ లేఖా సాహిత్యంలో ఓ మైలురాయి అని చెప్పాలి. దీనిలో నేను నా స్నేహితురాలికి రాసిన ఉత్తరం కూడా ఉంది. అయినంపూడి శ్రీలక్ష్మి 'కొత్త ప్రేమలోకం' అనే 56 ఇతివృత్తాలతో లేఖాసాహిత్యం రాశారు. ఆఖరుగా విద్వాన్ మహాకాళి వెంకటేశ్వరరావు శతావధానులు. ఎన్నో శతకాలు, చారిత్రక నవలలు రాశారు. సాహిత్య విలువలతో కూడిన ఉత్తరాలు మాకు రాసేవారు. అందుకే పూల సుగంధం దారానికి అంటినట్టుగా వారినుంచి నాకు కూడా కొత్త సాహిత్యం ఒంట పట్టింది.

హైదరాబాద్ వివేకనగర్‌లో కొత్తగా ఇల్లు కట్టినప్పుడు మాకు ఆ ఇంటి అడ్రస్ గురించి ఉత్తరం రాస్తూ.. 'అష్టోత్తర శతనామ దిష్టంబగు గృహము/ శ్రేష్టము వివేక నగరము వింసతి భాగ్యనగర్/ స్పష్టముగా వ్రాసి పంపుడు లేఖల్' అంటూ పోస్టు కార్డు రాసి పంపించారు. అంటే ఇంటినెంబర్ 108, వివేకనగర్, భాగ్యనగర్-20 అని ఇంటి అడ్రస్ అన్న మాట. ఇలాగే తాను రాసిన వెంకటేశ్వర శతకం నుంచి పోస్టు కార్డు మీద మాకు రాసి, మాకు అర్థం చెప్పి కంఠస్థం చేయించేవారు.

> **ఇలా సాహిత్యపరమైన, కళాపరమైన లేఖలే కాక ఇతర అంశాలతో కూడిన లేఖల ద్వారా ఆనాటి భాష, సంస్కృతి, వారి భావాలు, ఈనాటి తరం వారు తెలుసుకునేందుకు ఈ లేఖా సాహిత్యం ఎంతో దోహదం చేస్తుంది. ఇదే లేఖా సాహిత్య పరమార్థం.**

ఇటీవల పత్రికా సంపాదకులు సింగిల్ పేజీ కథలు, పోస్టు కార్డు మీద కథలు, కవితలు రాసి పంపమని అడుగుతున్నారు. ఇది లేఖ సాహిత్యంలో వస్తున్న కొత్త ఒరవడి. ఇలా సాహిత్య రంగంలో లేఖా సాహిత్యం గణనీయమైన పాత్ర పోషిస్తోందని చెప్పాలి.

ఈ మట్టి భాష

మట్టి మాట్లాడుతుంది
మట్టి వాసన వెదజల్లుతుంది
నెత్తిన మొలిచే ఎండ
గుండెల్ని చీల్చిన
కాసిన్ని చినుకులతో
తడితడిగా మాట్లాడుతుంది.

జీవకోటికి జవసత్వాన్ని ఇచ్చే భాషలో
మాట్లాడుతుంది.

ఒక చెట్టు గానో
ఒక చేను గానో
ఒక పువ్వు గానో
ఎదగడానికి ఆధారమౌతూ
ఏదో జీవ భాష మాట్లాడుతుంది
మనిషిని శ్వాసించమంటుంది
మనిషిని ప్రేమించమంటుంది

విద్వేషాలు రగిలిన చోట
మానవత్వపు భాష మాట్లాడుతుంది.

రైతుల కళ్లలోకి చూసి
చేనుగా మాట్లాడుతుంది
కష్టానికి ప్రతిఫలంలా మాట్లాడుతుంది.

మట్టిని నమ్మిన మనిషి
మారణాయుధం కాకూడదని
కన్నీరు కారుస్తూ మాట్లాడుతుంది.
మానవ తప్పిదాలకు తల
బాదుకుంటూ
మాట్లాడుతుంది.
ఎర్రెర్రని సంకేతాలతో
మాట్లాడుతుంది.

గవిడి శ్రీనివాస్
7019278368

పద్యం వన్స్ మోర్

'పద్యం'పై ఆధిపత్య భావజాలం గలదనే విమర్శ ఉన్నది. పూర్వం రాజుల ఆశ్రయంలో, సామాన్యుల నోట 'పద్యం' మకుటం లేని మహారాజులా వెలుగొందింది. రాజాశ్రయం కోరని సామాజిక సమస్యలను పద్యకావ్యాలుగా రాసిన కవులను ప్రజాకవులుగా నిలబెడితే, రాజాశ్రయం పొందినవి కొన్ని మాత్రం సాహిత్య గుర్తింపును పొందాయి. పాల్కురికి సోమన, పోతన, వేమన, వీరబ్రహ్మం లాంటివారు పద్యాన్ని రాజాశ్రయాల నుంచి సామాన్య ప్రజానీకం వద్దకు చేర్చారు. పోతన భాగవతంలోని పద్యాలు నోట పలకని తెలుగువారుండరు. అలాగే వేమన, సుమతీ లాంటి మకుట శతక పద్యాలు తెలుగువారి మానసిక వికాసానికి, నీతి, లోకరీతిని తెలియజేయడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. తెలుగువాడి చేత 20వ శతాబ్దంలో పద్య నాటకాల రూపంలో 'పద్యం' వన్స్‌మోర్ కొట్టించుకున్నది. తిరుపతి వేంకటకవులు రాసిన పాండవోద్యోగం నాటకంలోని 'బావా! ఎప్పుడు వచ్చితీవు...' లాంటి పద్యాలు, భారత, రామాయణ, భాగవతాలకు సంబంధించిన నాటకాలలోని పద్యాలు తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దాలుగా ప్రతిబింబించాయి. జంధ్యాల పాపయ్య శాస్త్రి, గుర్రం జాషువా లాంటి ఆధునిక కవులు పద్యాన్ని ఆరాధించడమే కాకుండా కుంతీ కుమారి, పుష్పవిలాపం, కష్టజీవి, గబ్బిలం లాంటి ఖండకావ్యాలను రాసి, తెలుగువారి మన్ననలను పొందారు.

ప్రాచీన కాలం నుంచి 'పద్యం' ప్రజల నరనరాల్లో నిద్రాణమై జీవిస్తున్నది. అలాంటి 'పద్యం'పై మమకారం కలిగిన నేటికవులు శతక రచనలు, ఖండకావ్య రచనలు చేస్తున్నారు. 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నా గద్యమంతా కవిత్వం కాదు. కానీ, తెలుగు సాహిత్యమంటే, కవిత్వమంటే ఒకప్పుడు పద్యమే!

కోమటి మధుసూదన్ 'మధురగీతి' పేరుతో ఖండకావ్య సంపుటిని 28 ఖండికలుగా రచించాడు. నేటి సమాజం పద్యాన్ని ఆదరిస్తుందా? అన్న ప్రశ్నకు ఈ పుస్తకంలో పద్యం హృద్యం అనే ఖండికలో పద్యం గొప్పతనాన్ని తెలిపే ప్రయత్నం చేశారు. పద్యం చదువడం వల్ల పలుకులో స్పష్టత వస్తుందని, పద్యం నేర్చుకోవడం వల్ల పద సంపద, జ్ఞాపకశక్తి పెరిగి, ఉపన్యాస శక్తి అలవడుతుందని, మనసు పరవశిస్తుందని, పద్యం రాయడం వల్ల నూతన పదజాలం సృష్టింపబడుతుందని అంటారు.



> **అమ్మ పద్య ఖండికలో...**
> **'నీ జన్మ కొరకు తానే**
> **పోజాలును యముని తోడి**
> **పోరున కైనన్**
> **ఈ జగతి నీకు చూపిన**
> **నీ జననికి సాటి లేరు నిక్కము**
> **నరుడా!'**

అన్న పద్యం తల్లి గొప్పతనానికి నిదర్శనంగా నిలిచింది.

> **నాన్న ఖండికలో...**
> **'నాన్న కన్న నెరుగ నారాయణుడు లేడు**
> **కంటి రెప్పవలెను కాచునతడు**
> **ఎంతసేవజేయ యేమితీరు ఋణము**
> **కొంతనైన చేసి కొడుకు వగుము'**

అనే సందేశం గొప్పగా ఉంటుంది.

> **గురువు ఖండికలో...**
> **'దేవదేవులైన దివ్య స్వరూపులు**
> **రామకృష్ణ లకట రారె చదువ**
> **ఎంత వారలైన యెదనుండు దైవమా**
> **పాదపద్మములకు ప్రణతిజేతు'**

అన్న పాదాలు గురువు స్థాయిని ఆకాశానికెత్తుతాయి.

> **అన్నదాత ఖండికలో..**
> **'ఎవని కరుణ లేని ఏకాకి రైతయ్యె**
> **ప్రకృతి వైపరీత్య ఫలితమొకటి**
> **బాధలెన్ని యున్న బాయడు సేద్యము**
> **రైతుకెవరు సాటిరారు పుడమి'**

అన్న పాదాలు రైతు దీనావస్థను తెలియజేస్తాయి.

> **కవి ఖండికలో...**
> **కవిత జీవించు మనిషిలో కాలగతిని**
> **తగిన సందర్భ మందున తలపు వెడలి**
> **మదిని భావాలు**
> **వివరించి మధురముగను**
> **పాటయై గేయమై కాక పద్యమగుచు'**

అంటూ ప్రతి వ్యక్తిలోనూ సందర్భానికి తగినట్టుగా కవిత్వం పుట్టుకొస్తుందని, అది పాట రూపంలోనో, గేయం రూపంలోనో, పద్యం రూపంలోనో ప్రతిఫలిస్తుందని అంటారు.

ఈ విధంగా కవి కోమటి మధుసూదన్ రాసిన ఈ మధురగీతి ఖండకావ్య సంపుటి నేటి సమాజం లోని ఎన్నో సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తుంది.

శీలం భద్రయ్య
98858 38288

కృతజ్ఞతలు

ప్రచారం
నీకంటే ఎత్తుగా ఉండకూడదు
పని
నీకంటే పొట్టిగా ఉండకూడదు

బాకాలు డప్పులు
చుట్టూ ఉన్న జనాలకు వినోదాన్నిస్తాయి
చప్పట్లు ఈలలు
నిన్ను నీకు
తెలియకుండా చేస్తాయి

పరదా మీద ఎంత
పెద్ద దీపం బొమ్మ గీసినా
అడుగుల మీద వెల్తురు పడదు

మునిలా
నీ పని నీవు చేసుకుంటూ వెళ్లు
తుఫాను నీ పక్కనుంచే
నిశ్శబ్దంగా సలాం చేస్తూ వెళ్తుంది

(ఈ పోయెం రాయించిన జమాల్ పాషా నాతో గల్లీల్లో ఆడుకున్న బాల్య మిత్రుడు)

ఆశారాజు

> **మహాకవి కాళిదాసు రుతు సంహార కృతి కలినంగా లేకపోవడంతో మల్లినాథ సూరి దీనికి వ్యాఖ్యానం రాయలేదు. ఇక్కడ మనం ఒక విషయాన్ని గమనించాలి. ప్రజల భాషలోనే కవిత్వం రాయాలనే నేటి అభ్యుదయ కవులకు ఆద్యుడు మహాకవి కాళిదాసు అని, ఆయన రుతు సంహార కావ్యం ఆధారంగా చెప్పవచ్చు.**

విద్యను సంస్కృతీకరించాలె!

2024 మే 20న 'నమస్తే తెలంగాణ' దినపత్రిక 'చెలిమె'లో రఘువర్మ రాసిన 'కాళిదాసు తొలి కృతి రుతు సంహారం' అనే శీర్షికతో వచ్చిన లఘు వ్యాసాన్ని చదివాను. సాహిత్య ప్రపంచంలో ఎందరో కవులున్నా మహాకవి అనగానే 'మహాకవి కాళిదాసు' గుర్తుకువస్తాడు. పాఠశాలల్లో సంస్కృత భాష కనుమరుగవుతున్న ఈ కాలంలో నేటి విద్యార్థులు మహాకవి కాళిదాసు రుతు సంహార కావ్యాన్ని అర్థం చేసుకోవడం కష్టమనే చెప్పాలి. దీనికి ప్రధాన కారణం నేడు సంస్కృత భాషను నేర్పే విధానంలో ఉన్న లోపం. విద్యార్థులకు సంస్కృత భాషను నేర్పడమంటే ఓ పదిరువై దేవతా స్తుతులను నేర్పడం, ఆపై నాలుగు శబ్దాలను, నాలుగు ధాతువులను నేర్పడం, తర్వాత భర్తృహరి సుభాషితాలు, పంచతంత్ర కథలు వంటివి నేర్పడం అనే ధోరణిలో నేటి సంస్కృత భాషాభిమానులు ముందుకుసాగిపోతున్నారు. దీంతో విద్యార్థులు సంస్కృత భాష అంటే పూజల శ్లోకాలకు, కాలక్షేప కథలకు మాత్రమే పరిమితమవుతున్నారు. కాదు కూడదంటే మంత్రాలకు, వరాలకు, శాపాలకు పరిమితం అనే దృష్టికి వచ్చారు.



> ఆంగ్ల భాషా ప్రభావం అతి తక్కువగా ఉన్న కాలంలో సంస్కృత భాషాభ్యాసం ఈ రీతిలోనే ఉండటం వల్ల ఆంగ్ల భాష అత్యంత సులభంగా సంస్కృత భాషను తోసి రాజన్నది. నిజానికి మహాకవి కాళిదాసు రచనలే అధికంగా పాఠ్యాంశాలై అవి శాస్త్రీయ బోధనకు నోచుకుని ఉంటే పరిస్థితి మరోరకంగా ఉండేది.

మహాకవి కాళిదాసు రుతు సంహార పఠనం సంస్కృత సంభాషణకు ఉపయోగపడితే, అందలి భావ పరంపరలు ప్రకృతి ధర్మాలను, జీవశాస్త్ర ధర్మాలను కలిగి ఉంటాయి. ఇక ఆయన రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం కావ్యాలు పురాణ కథలను చెప్పడమే కాకుండా విజ్ఞాన ఛాయలతో ప్రకాసిస్తుంటాయి. ఆ ఛాయా పూరిత భాష సమాజానికి అందితే సమాజ నిజ జీవితానికి కావల్సిన పారిభాషిక పదాలు (టెర్మినాలజీ) సమాజానికి అందుతాయి.

మహాకవి కాళిదాసు కవిత్వంలో నేటి సమాజానికి కావల్సినంత టెర్మినాలజీ ఉన్నది. కానీ ఆ దిశగా సంస్కృత భాషా బోధన జరగలేదు. ఉదాహరణకు మహాకవి కాళిదాసు తన కుమారసంభవ కావ్యంలో 'పృథివ్యా ఇవ మానదండః' అని అంటారు. అంటే హిమవంతుడు భూమికి కొలబద్ద లాగ నిలిచి ఉన్నాడని అర్థం. ఇక్కడ మానదండం అనేది పారిభాషిక పదం. ఇలాంటి పదాలను మరింత విపులంగా వివరించగలిగే బోధకులు ఉంటే సంస్కృత పారిభాషిక పదజాలం విద్యార్థులకు సమృద్ధిగా అందుతుంది. దురదృష్టకరమైన విషయం ఏమంటే ఈ రీతిన పూర్వీకుల బోధన జరగలేదు. హిమవంతుడు భూమికి కొలబద్ద, ఆయన మహానుభావుడు. మహా మహా యజ్ఞాలు, యాగాలు చేశాడు అంటూ ఆధ్యాత్మిక చట్రంలో ఒకనాటి బోధన జరిగింది. కొంతమంది ఛాందస పండితులైతే మహాకవి కాళిదాసు కవిత్వమా! 'అల్లుని మంచితనము, గొల్లని సాహిత్యము' అంటూ మహాకవి కాళిదాసుని కులపరంగా ఎగతాళి చేశారు. సంస్కృత భాష ప్రజలకు దూరమవుతుండేసరికి మరలా మహాకవి కాళిదాసు సూపర్, డూపర్, బంపర్ అంటున్నారు.

> **నిజమైన కవి చెప్పే సాహిత్యంలో, కవి తను చెప్పే కథతో పాటు తనకు తెలిసిన విజ్ఞాన ఛాయలను కూడా కుప్పించి రాస్తాడు. అలాంటి వారే మహా కవులవుతారు. అలాంటి మహా కవి ఎవరంటే మహాకవి కాళిదాసు.**

మహాకవి కాళిదాసు తన రఘువంశాన్ని 'వాగర్థావివ సంపృక్తౌ...' అనే శ్లోకంతోనూ, తన కుమార సంభవాన్ని 'అస్తి ఉత్తర శ్యాం దిశి' అనే శ్లోకం తోనూ, తన మేఘ సందేశాన్ని 'కశ్చిత్ కాంత విరహ..' అనే శ్లోకంతోనూ ప్రారంభించారు. ఈ శ్లోకాలలోని మొదటి పదాలు వాక్, అస్తి, కశ్చిత్. ఈ మూడు పదాలను కలుపుకొంటే 'వాగస్తి కశ్చిత్' అంటే ఒకనొక వాక్కు ఉన్నది అని అర్థం.

మహాకవి కాళిదాసు తనకు ఒకానొక వాక్కు ఉన్నదని రాశారు. కానీ తన వాక్కే ఆ వాక్కని అహంకరించలేదు. ఆ ఒకానొకలోనే అమోఘ అర్థాన్ని చూడవచ్చు. అలాగే 'ఏకోహి దోషోః గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః' అని మహాకవి కాళిదాసు హిమవంతుడిని వర్ణిస్తూనే నా సాహిత్యంలో చిన్న దోషం ఉన్నదని నా సాహిత్యమునంత తప్పు పట్టకండి అన్నారు. చంద్రునిలో మచ్చ ఉందని చంద్ర కిరణాలను శంకించం కదా అనే భావాన్ని నర్మగర్భంగా తను రాసిన శ్లోకంలో ఉంచారు. మహాకవి కాళిదాసు వ్యాసుని నడుమ జరిగిన తు.చ. కథ కూడా చివరికి మహాకవి కాళిదాసు వినయాన్నే తెలియజేస్తుంది.

మహాకవి కాళిదాసు కావాలనే ఇలా రాశాడా అంటే తను కావాలనుకున్నా, వద్దనుకున్నా శ్యామలాదేవి అతనిని అలా అనుగ్రహించిందని చెప్పాలి తప్ప అతని కులం మీద ద్వేషంతోనో, అతని సాహిత్యం మీద అసూయతోనో మరో రకంగా చెప్పకూడదు. ఏతావాతా చెప్పేదేమంటే ఈనాటి సమాజానికి సైతం మహాకవి కాళిదాసు రచనలు సంస్కృత భాషాభివృద్ధికి చక్కగా ఉపయోగపడతాయి. సరళ సంస్కృత భాష, చక్కని భావజాలం, నేటి సమాజానికి సైతం ఉపయోగపడే పారిభాషిక పదజాలం, విజ్ఞాన ఛాయలతో కూడిన ఆలోచనావిధానం, కావల్సినంత మేర భక్తి, మేధో సామర్థ్యాన్ని పెంచే యుక్తి మహాకవి కాళిదాసు సాహిత్యంలో ఉన్నది. నిజమైన సంస్కృత భాషాభిమానులు మహాకవి కాళిదాసు సాహిత్యం సహాయంతో, అందునా రఘువర్మ చెప్పిన మహాకవి కాళిదాసు తొలి రచన రుతు సంహారం సహాయంతో సశాస్త్రీయంగా ముందడుగు వేస్తే ఆధునిక విద్యా ప్రపంచం సైతం సంస్కృత భాషను ఆంగ్లంలా అక్కున చేర్చుకుంటుంది.

వాగుమూడి
లక్ష్మీరాఘవరావు
98494 48947

గీతం పురస్కారం

గీతం సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కవితా సంపుటాల పోటీ నిర్వహించిన విషయం తెలిసిందే. దాంతో పాటు ఉత్తమ కథా సంపుటాల పోటీలను నిర్వహించి 'గీతం పురస్కారం' ఇవ్వాలని నిర్ణయించాం. అత్యుత్తమ కథా సంపుటికి పురస్కారంతో పాటు రూ.10,116 నగదు, జ్ఞాపిక అందజేస్తాం. 2016-2024 మధ్య కాలంలో విడుదలైన సంపుటాల మూడు కాపీలను ఓలేటి వెంకటేశ్వరరావు, అధ్యక్షులు, గీతం సాహితీ సంస్థ,పిఠాపురం-533450 చిరునామాకు జూలై 5వ తేదీలోపు పంపించాలి.

– ఓలేటి వెంకటేశ్వరరావు,
గీతం సాహితీ సంస్థ అధ్యక్షులు

దాశరథి శతజయంతి సంచిక కోసం..

ఈ నెల 22న దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి సంవత్సరం ఆరంభం కానున్నది. ఈ సందర్భంగా వారిని స్మరించుకుంటూ దాశరథి శతజయంతి సంచికను ప్రత్యేకంగా తీసుకురావాలని సంకల్పించాం. దాశరథి కృష్ణమాచార్యులతో అనుబంధం గలవారు, వారితో తమకున్న జ్ఞాపకాలను రచనల రూపంలో 'పాలపిట్ట'కు పంపవలసిందిగా కోరుతున్నాం. దాశరథితో ఉన్న సాన్నిహిత్యం, స్నేహ, సౌహార్ద సంబంధాలను పంచుకోడానికి సాహిత్యాభిమానులకు, కవులకు, రచయితలకు శతజయంతి సంచికలో తగిన స్థానం కల్పిస్తాం. అలాగే విభిన్న సాహిత్య సంస్థల వారు, వ్యక్తులు దాశరథితో తమకున్న సాహిత్య సంబంధాల గురించి ప్రస్తావించవచ్చు. ముఖ్యంగా దాశరథితో తాము పాల్గొన్న సభలు, వారితో కలిసున్న ఫొటోలను పంపించవలసిందిగా మనవి. సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా మొదలైన సృజనాత్మక రంగాలతో ముడిపడినది దాశరథి జీవన వైశాల్యం. అందుకే దాశరథికి సంబంధించిన ప్రతి అంశాన్ని సంచికలో పొందుపరచాలని 'పాలపిట్ట' భావిస్తున్నది. దాశరథి అనేకులకు ఉత్తరాలు కూడా రాశారు. తమ దగ్గర భద్రంగా ఉన్న ఆ ఉత్తరాల ప్రతులను కూడా పంపించాలని కోరుతున్నాం. దాశరథి తొలినాళ్ల పుస్తకాల కవర్ పేజీలు కూడా పంపవచ్చు. దాశరథి శతజయంతి సందర్భంగా వెలువరించే ఈ బృహత్తర సంచిక కోసం మీ రచనలు, సూచనలు, ఫొటోలు పంపించవలసిన చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, ఎం.ఐ.జి-2, ఏపీహెచ్‌బీ, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044, ఫోన్: 9490099327, ఈమెయిల్: palapittabooks@gmail.com

– గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట